బడి.. కొత్త ఒరవడి

- నాడు–నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- రెండో దశలో రూ.25.30 కోట్ల కేటాయింపు
- 58 పాఠశాలలకు నిధుల మంజూరు

పెందుర్తి మండలం సరిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎన్‌ఈపీ అమల్లో భాగంగా సమీపంలోని హైస్కూల్లో 3,4,5 తరగతులను విలీనం చేశారు. పాఠశాలలో నాడు–నేడు మొదటి విడతలో భాగంగా రూ.19.90 లక్షలతో మౌలిక సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు ఆ పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా తయారైంది.



నాడు–నేడు మొదటి విడతలో అభివృద్ధి చేసిన పెందుర్తి మండలం సరిపల్లి ప్రాథమిక పాఠశాల

విశాఖ విద్య: నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు ఏ రీతిన అభివృద్ధి చెందాయనేది చెప్పడానికి సరిపల్లి ప్రాథమిక పాఠశాల నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. నాడు–నేడు రెండోదశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ పశ్చిమ నియోజకవర్గం, పెందుర్తి మండలంలోని 58 పాఠశాలల్లో రూ.25.30 కోట్లతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. తొలివిడతలో విశాఖ అర్బన్, పెందుర్తి మండలాల్లో 55 స్కూళ్ల అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా రెండో విడత పనులు చేపట్టారు. జాతీయ విద్యా విధానం అమలు మేరకు అంగన్‌వాడీల విలీన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో పనులపై విద్యాశాఖాధికారులు మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు.

120 అదనపు గదుల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అవసరమైన పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రెండో విడత పనుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. విశాఖ అర్బన్, పెందుర్తి మండలాల్లోని 22 హైస్కూళ్లలో 120 అదనపు గదులు నిర్మిస్తున్నారు. ఒక్కో అదనపు గది నిర్మాణానికి రూ. 12 లక్షలు కేటాయించారు.

కార్పొరేట్ లుక్‌తో..

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వాములు చేసి సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనులు చేపడుతున్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, ఎల్‌ఈడీ టీవీలు ఇలా సకల సౌకర్యాలు పాఠశాలల్లో సమకూరుతున్నాయి.



పచ్చదనంతో ఆహ్లాదకరంగా పాఠశాల ప్రాంగణం



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ట్యాప్‌లు



పాఠశాల ప్రాంగణంలో సరస్వతీదేవి విగ్రహం

దేవాలయంతో సమానం



బడి దేవాలయం లాంటిది. ఇక్కడే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు పడతాయి. అందుకే స్కూల్ అభివృద్ధికి నా సొంత నిధులు కూడా వెచ్చించి సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాను. విద్యార్థుల బాగు కోసమని ప్రభుత్వం స్కూల్ అభివృద్ధికి నిధులు కేటాయించడం గొప్పవిషయం.

–బీహెచ్ లక్ష్మి, సరిపల్లి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం

సకల వసతులు



నాడు–నేడు పనులతో ప్రభుత్వ స్కూళ్లలో సకల వసతులు కల్పిస్తున్నారు. రెండోదశలో హైస్కూళ్లకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించడం మంచి పరిణామం. స్థల సమస్యపై ఊరి పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకున్నాం. త్వరలోనే అదనపు గదులు నిర్మాణం ప్రారంభిస్తాం. అవి పూర్తయితే వసతి సమస్య తీరుతుంది. విద్యార్థుల అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా పనులపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– వి. సువర్చల, హెచ్‌ఎం, సరిపల్లి హైస్కూల్

బిచ్చగాడికి అంత్యక్రియలు



ఫుట్‌పాత్‌పై మృతి చెందిన బిచ్చగాడి సేవలో దమ్ము శ్రీనివాసరావు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారు ఎదురుగా బీఆర్‌టీఎస్ రహదారిలో గుర్తు తెలియని బిచ్చగాడు మృతి చెందాడు. గుర్తించిన 92వ వార్డు శానిటరీ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు మృతదేహానికి దుస్తులు వేసి సపర్యలు చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో అంత్యక్రియలు చేశారు. దమ్ము శ్రీనును పలువురు అభినందించారు.

అంధ కళాకారులకు ఆర్థిక సాయం



కళాకారుడికి నగదు సాయం చేస్తున్న చిన్నారులు

మల్కాపురం: స్థానిక లక్కీ అమర్ పాఠశాల విద్యార్థులు అంధ కళాకారులకు ఆర్థిక సాయం చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు చోట్ల సినీ, జానపద గీతాలు ఆలపించే అంధ కళాకారులను చూసి చిన్నారులు చలించిపోయారు. తల్లిదండ్రులు తమకు రోజూ ఇచ్చే పాకెట్ మనీని దాచి సుమారు రూ.30 వేలు పోగు చేశారు. ఆ మొత్తాన్ని బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రిన్సిపాల్ వాసుదేవరావు చేతుల మీదుగా కళాకారులకు అందించి తమ గొప్ప మనసు చాటుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తన వంతు సాయంగా రూ. 5 వేలు కళాకారులకు ఇచ్చారు.

క్లుప్తంగా

ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరికలు



కొత్తగా చేరిన వారితో ఈయూ నేతలు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ)కు చెందిన ముగ్గురు బుధవారం ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఎన్‌ఎంయూకు చెందిన జె.సత్యవంతుడు, బి.రమణరావు, డి.రమేష్ చేరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ఎస్.రావు, జిల్లా కోశాధికారి కెఎంఎస్‌పి స్వామి, సింహాచలం డిపో గ్యారేజీ కమిటీలు జి.పి.ఎస్.నాయుడు, రమణ, చన్నా, రత్నాజీ, శేఖర్, శ్రీను, రత్నం పాల్గొన్నారు.

వైభవంగా పందిరి రాట మహోత్సవం



పందిరి రాట వేస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం పందిరి రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని పూజ చేసి పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దసరా మహోత్సవాలను ఏటా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

అల్లిపురం : యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం బంగారమ్మమెట్ట ప్రాంతానికి చెందిన పి.బాలభార్గవ స్థానికంగా గల సాయిప్రసన్న మెడికల్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి గత ఏడాది కాలంగా పూతి వెంకటరెడ్డి, పూతి గణేష్‌రెడ్డితో స్నేహం కొనసాగుతోంది. అయితే పది రోజుల క్రితం పూతి వెంకటరెడ్డికి, బాలభార్గవ్‌కు గొడవ జరగటంతో వీరిద్దరు మాట్లాడుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో పూతి వెంకటరెడ్డి బాలభార్గవకు ఫోన్ చేసి నీలమ్మ వేపచెట్టు దగ్గరకి రమ్మని చెప్పడంతో భార్గవ అక్కడికి వెళ్లాడు. అక్కడ పూతి వెంకటరెడ్డితో పాటు పూతి గణేష్‌రెడ్డి, సబ్బి శ్రీనివాస్ ఉన్నారు. ఆ ముగ్గురిలో ఒకరు భార్గవ పీక పట్టుకుని, వారి వెంట తెచ్చుకున్న కత్తితో భార్గవ ఎడమ చేతి మీద, ఎడమ వైపు కడుపులో పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడి నుంచి తప్పించుకుని కేజీహెచ్‌కు చేరుకున్న భార్గవ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక విశాఖ

సీతంపేట: మత సామరస్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, రెలిజియస్ ఫ్రీడం సంస్థల ప్రతినిధులు బుధవారం నగరంలో వివిధ మతాలకు చెందిన దేవాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సమైక్యతకు విశాఖ ప్రతీకని, నగర ప్రజలు శాంతికాముకులని, ఇతరులకు ఆదర్శప్రాయులని కొనియాడారు. దీనిలో భాగంగా పోర్టు వెంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడే ఉన్న చర్చి, దర్గా, గురుద్వారాలను సందర్శించి వారి ఆచారాలు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. నరవ ప్రకాశరావు, రాజశేఖర్, నరసింహారావు, గౌరీ శంకర్, ప్రజ్ఞాన్‌కుమార్, మహ్మద్ హుస్సేన్, రాజేంద్ర జైన్, బెనర్జీ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై జోన్–5, 8 జోనల్ కమిషనర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లతో బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. షీలానగర్‌లోని విశాఖ డెయిరీ ట్రస్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జెడ్సీలు కృష్ణ, మల్లయ్య నాయుడు, డీఎంహెచ్‌వో, ఏఎన్‌ఎంలు, వార్డు కార్పొరేటర్లు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ వార్డుల ఇన్‌చార్జిలు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆడారి సొంత నిధులతో పింఛన్ల పంపిణీ



59వ వార్డులో పింఛన్ అందజేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్



పాత గోపాలపట్నంలో పింఛన్లు అందిస్తున్న బెహరా భాస్కరరావు

మల్కాపురం: అర్హత ఉన్నా సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పింఛన్ అందని వారికి వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అండగా నిలుస్తున్నారు. ఆడారి తులసీరావు ట్రస్టు ద్వారా సొంత నిధులతో పింఛన్లు అందిస్తున్నారు. జీవీఎంసీ 40,58,59, 60,61,62,63 వార్డుల పరిధిలో సుమారు 300 మంది వరకు ఆయన ప్రతి నెలా సాయం అందిస్తూ ఆర్థిక ఇబ్బందులను తొలగిస్తున్నారు. అక్టోబర్ నెల పింఛన్‌ను ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌లో పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ పింఛన్లు ఇచ్చారు.61వ వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు)నాయకులతో కలిసి పలువురి పింఛన్ సొమ్ము అందజేశారు.

91, 92 వార్డుల్లో ..

గోపాలపట్నం : జీవీఎంసీ 91, 92 వార్డుల పరిధిలో కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 91వ వార్డులో 8 మందికి రూ. 22,000, 92వ వార్డులో 8 మందికి రూ. 17,250 పింఛన్లు అందించామన్నారు. సాంకేతిక ఇబ్బందుల కారణంగా పింఛన్లు రాని వారికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను జయప్రదం చేద్దాం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి జయప్రదం చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, రమిడి రామకృష్ణ, పీఎస్ రాజు, దాసరి శ్రీను, తమ్మిరెడ్డి, పోకల అర్జున్, కాలాదేవి, ఉష, జ్యోతి, సుమతి, వరలక్ష్మి, రాజశేఖర్, కె. త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రోగికి పింఛన్ ఇస్తున్న 61వ వార్డు నాయకులు

అప్రమత్తతతో దొంగతనాలకు చెక్



అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం : దొంగతనాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని ఈస్ట్ క్రైం సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సూచించారు. కాలనీ అసోసియేషన్లు, అపార్టుమెంట్ అసోసియేషన్లు, ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. బుధవారం సాయంత్రం అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ వెంకటరామ గ్రంథాలయంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన వస్తువులు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వలన వాహనాలకు రక్షణ ఉంటుందన్నారు. తీర్థయాత్రలు, దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులు ఉచితంగా అందించే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. దానివల్ల పోలీసులు ఆ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తారన్నారు. తిరిగి వచ్చే వరకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఇది పూర్తిగా ఉచితమన్నారు. దీనిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టూటౌన్ క్రైం ఎస్‌ఐ కె.శ్రీను, హెడ్ కానిస్టేబుల్ హాఫీజ్, కానిస్టేబుల్ గణేష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆటో జాత



గోపాలపట్నంలో ఆటో జాతా ప్రారంభిస్తున్న బలివాడ వెంకటరావు తదితరులు

గోపాలపట్నం: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఆటో జాతాను సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 5న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటూ పదేపదే చెబుతుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న 5 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభలో ఆల్ ఇండియా కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీహెచ్ నర్సింగరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

యువశక్తే దేశ సంపద



స్వామి గీతా సారనంద మహరాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక: భారతదేశానికి యువత అద్భుత శక్తి అని స్వామి గీతా సారనంద మహరాజ్ అన్నారు. వివేకానంద ఆలోచనలు, యువత అంశంపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచదేశాల్లో భారతదేశ యువత ప్రత్యేకతను కలిగి ఉంటారన్నారు. యువత తాము అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అహర్నిశలు శ్రమించాలని, క్రమశిక్షణతో దేనినైనా సాధించవచ్చని అన్నారు. యువత అలసత్వాన్ని దరి చేరనీయరాదని హితోక్తి పలికారు. యువత తలచుకుంటే అద్భుతాలు సాధించవచ్చన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాల అధ్యయనంతో దేశానికి మేలు



ఏవీఎన్ కళాశాలను సందర్శించిన కశ్మీర్ యువత

అల్లిపురం : భారతదేశంలో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలను యువత అధ్యయనం చేయడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందని నెహ్రూ యువ కేంద్రం అధికారి జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఏవీఎన్ కళాశాలలో బుధవారం సాయంత్రం యూత్ ఎక్స్ఛేంజ్ ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జమ్ముకశ్మీర్ నుంచి 120 మంది యువత విచ్చేసి ఏవీఎన్ కళాశాలను సందర్శించారు. కళాశాల చరిత్ర, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థాయిలో ఉన్న విషయాలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన అవార్డు గ్రహీత లీలా ప్రసాద్, శ్రీకాకుళం ఎన్‌వైకే అధికారి ఉజ్వల్, కో ఆర్డినేటర్ పైడి రజని, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రి (జీవీఎంసీ) వద్ద బుధవారం ఉదయం జగనన్న వైద్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పలువురికి వైద్య సేవలు అందించారు. వార్డు కార్పొరేటర్ పి.వి. సురేష్ దగ్గరుండి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి జగనన్న వైద్య సురక్ష కార్యక్రమం ద్వారా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆయా ప్రాంతాల వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్నారని అన్నారు. ఆ వివరాల ఆధారంగా అవసరమైన వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడుం కట్టారని, దీనికి ప్రజలంతా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కలిగిస్తున్న రామ్మోహనరెడ్డి

సింథియా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. చింతల్లోవ సచివాలయం పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, వార్డు వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ ప్రజల ముంగిటకే వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వార్డులోని ప్రతి ఇంట్లో ఉన్న వారి ఆరోగ్యం గురించి ఆరా తీస్తారని, వారికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ నెల 21న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సోమాదుల సురేష్, వార్డు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొట్నాన రవి, భోగవిల్లి నాగభూషణం, సూరాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వైభవంగా సింహాచలేశుడి నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు ఆత్మకూరి రవి, గొడవర్తి గిరి, సంతోష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.